క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జ్యోతి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడి పల్లె గ్రామ పంచాయతీలోని కొండమూల గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఉత్సవాలను మంగళవారం రాత్రి తొగటవీర క్షత్రియ సంఘం వారిచే అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి సాయంత్రం 4 గంటల నుంచి జ్యోతులను తయారు చేశారు. ఈ జ్యోతులను శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారిని రాత్రి 9 గంటల నుంచి సింహ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించనున్నారు. అలాగే అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం చేయనున్నారు. కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తొగట వీర క్షత్రియ సంఘం కుటుంబసభ్యులు, భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి అభిషేకం



విశేష అలంకరణలో స్వామివారు

వాల్మీకిపురం : పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చన, తోమాలసేవ, ఆకుపూజ, వడమాల పూజ, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్త ఇందిరమ్మ కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మి నరసింహస్వామి

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎంలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి బ్రహోత్సాల్లో భాగంగా మంగళవారం స్వామి హనుమంత వాహనంపై ఊరేగారు. తండాయి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వాసవీ జయంతి మహోత్సవాలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గణపతి హోమం, సాయంత్రం వాసవీ సహస్రనామ పారాయణం, వాసవీమాత జీవిత గీతం, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో ప్రాకారోత్సవం, మహామంగళహారతి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, ఉపాధ్యక్షులు గిరిధర్, సభ్యులు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ

తిరుపతి మంగళం : తిరుపతిలో కొలువై గుర్తింపు పొందిన తిరుపతి తాతయ్యగుంట గంగ జాతరను వైభవంగా నిర్వహించుకుందాని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం తాతయ్య గుంట గంగమ్మ తల్లి నామావళి సీడీని ఆయన ఆవిష్కరించారు. వర్ణ మ్యూజిక్ అకాడమీ సమర్పణలో డాక్టర్ విజయలక్ష్మి రచించి, కోనేరు లక్ష్మిరాజ్యంతో కలిసి గానం చేయగా, ఆర్ కళ్యాణ్‌కుమార్ సంగీతం సమకూర్చారు. గత ఏడాది సినీ గాయకురాలు మంగ్లీతో పాటు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, అప్పటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ ఆలపించిన గంగమ్మ పాటలకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు వచ్చాయి. పాటలు భక్తులను అలరించేలా రూపొందించినట్లు తెలిపారు.

రాజంపేటలో తగ్గిన పోలింగ్ శాతం

- 2019లో 80.39 శాతం, ఈ ఎన్నికల్లో 76.99 శాతం పోలింగ్
- పోలింగ్‌కు పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు

రాజంపేట : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్ శాతం 2019లో జరిగిన ఎన్నికలతో పోలిస్తే తక్కువే. నియోజకవర్గంలో 2,41,200 ఓట్లు ఉండగా, 1,83,442 ఓట్లు పోలైయ్యాయి. ఇందులో 95752 మహిళా ఓటర్ల కీలకం కానున్నాయి. నియోజకవర్గంలోని 287 పోలింగ్ బూత్‌లలో అధిక శాతం బూత్‌లలో మహిళలు ఉదయం నుంచి పోటెత్తిపోయారు. ఓటర్ల తీరు తెన్నులను పరిశీలిస్తే వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నట్లు రాజకీయ నిపుణులు వ్యక్తపరుస్తున్నారు. కాగా ఈ పోలింగ్‌లో 87,790 మంది పురుషుల ఓట్లు పోలైయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ కింద 2,211 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో 80.39 పోలింగ్ శాతం ఓటింగ్ కొనసాగింది. 76.99 శాతం పోలింగ్ నమోదైంది. దీన్ని బట్టి చూస్తే 2024లో 3.4శాతం పోలింగ్ శాతం తగ్గింది.

ఏయూ నుంచి రాయచోటికి ఈవీఎంలు తరలింపు

రాజంపేటలోని ఏయూ(అన్నమాచార్య యూనవర్సిటీ)కి నియోజకవర్గంలో వివిధ పోలింగ్ కేంద్రాల నుంచి అర్ధరాత్రి వరకు ఈవీఎంలు చేరుకున్నాయి.



రాజంపేట ఆర్‌ఓ మోహనరావు పర్యవేక్షణలో రాయచోటికి లారీలలో ఈవీఎంలను తరలిస్తున్న దృశ్యం

మంగళవారం ఈవీఎంలను భద్రపరిచారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.మోహనరావు పర్యవేక్షణలో ఈవీఎంల తరలింపు కొనసాగింది. నాలుగు లారీల్లో ఈవీఎంలను భద్రపరిచి సీల్ వేసి రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కాలేజ్‌లోని ఈవీఎం స్ట్రాంగ్ రూంకు తరలించారు. ఈ లారీల వెంట పోలీసు బందోబస్తు మధ్య రాయచోటికి చేర్చారు.

పెనగలూరులో భారీగా పోలైన ఓట్లు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలో 31,329 ఓట్లు ఉండగా 23810 ఓట్లు పోలయ్యాయి. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేందుకు 41 బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో బూత్‌ల వారీగా ఓటర్ల వివరాలు.. తిరుణంపల్లి బూత్‌లో 837 ఓట్లకుగాను



ఈవీఎంలను లోడ్ చేస్తున్న ఎన్నికల సిబ్బంది

641 ఓట్లు, సిరివరంలో 492 ఓట్లకు 377, పెనగలూరులోని 214 బూత్‌లో 943 ఓట్లకు 662, పెనగలూరు 215 బూత్‌లో 1219 ఓట్లకు 883 ఓట్లు, ఎస్ఆర్ పురంలో 1088 మందికి గాను 870 మంది, పెనగలూరు 217 బూత్‌లో 820 ఓట్లకు 595, పెనగలూరు 218 బూత్‌లో 697 ఓట్లకు 562, ఇండ్లూరులో 789 మందికి గాను 562 ఓట్లు, సాతుపల్లిలో 758 ఓట్లకుగాను 579 ఓట్లు, కొండూరు 221 బూత్‌లో 1120 ఓట్లకుగాను 870 ఓట్లు, కొండూరు 222 బూత్‌లో 745 ఓట్లకుగాను 581 ఓట్లు, వీఎంపురంలో 258 ఓట్లకు గాను 213 ఓట్లు, వెలగచెర్లలో 740 ఓట్లకుగాను 564 ఓట్లు, గట్టువారిపల్లెలో 385 ఓట్లకుగాను 299, దామనచెర్లలో 101 ఓట్లకుగాను 92 ఓట్లు, సింగారెడ్డి పల్లిలో 735 ఓట్లకుగాను 601 ఓట్లు, కంబాలకుంటలో 929 మందికి 722, సింగనమలలో 868 ఓట్లకు గాను 668 ఓట్లు, నడిమి సిద్దవరంలో 1409 గాను 1018, ఓబిలిలో 1137 ఓట్లు ఉండగా 813 ఓట్లు, ఓబిలి దళితవాడలో 422 ఓట్లకుగాను 306 ఓట్లు, ఓదేటివారిపల్లిలో 498 గాను 394 ఓట్లు, దిగువ నారాయణ నెల్లూరులో 918కు 740, ఇసుకపల్లిలో 398 మందికి 309, నల్లపరెడ్డిపల్లి 236 బూత్‌లో 867 ఓట్లకుగాను 686 ఓట్లు, నల్లపరెడ్డిపల్లి 237 బూత్‌లో 607 ఓట్లకుగాను 490 ఓట్లు, బెస్తపల్లిలో 970 ఓట్లకు గాను 690 ఓట్లు, పొందలూరులో 1109 ఓట్లకుగాను 827 ఓట్లు, చక్రంపేట 240 బూత్‌లో 725 ఓట్లకు గాను 535 ఓట్లు, చక్రంపేట 241 బూత్‌లో 531 ఓట్లకుగాను 390 ఓట్లు, కాకర్లవారిపల్లిలో 784 ఓట్లకు గాను 528 ఓట్లు, పేరంవారిపల్లిలో 395 ఓట్లకుగాను 294 ఓట్లు, అనంతంపల్లిలో 597 ఓట్లకుగాను 470 ఓట్లు, ముద్రపల్లిలో 968 ఓట్లకుగాను 684 ఓట్లు, గోవిందంపల్లిలో 557 ఓట్లకుగాను 459 ఓట్లు, ఈటమాపురంలో 1347 ఓట్లకుగాను 980 ఓట్లు, మూగవారిపల్లిలో 580 ఓట్లకుగాను 437 ఓట్లు, నాయుడువారి పల్లిలో 1126 ఓట్లకుగాను 968 ఓట్లు, కట్టావారిపల్లిలో 890 ఓట్లకు 669 ఓట్లు, అప్పారాజుపేటలో 630 ఓట్లకు 501 ఓట్లు, రేగుంటవారిపల్లి బూత్‌లో 340 ఓట్లకు 287 ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఏడాది దాదాపు 2 వేల పైగా ఓట్లు ఈ సారి అధికంగా పోలయ్యాయి.

కాపాడు తల్లీ... విజయదుర్గమ్మ



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ప్రతి మంగళవారం లాగానే ఈసారి కూడా రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు.

వంగ సాగుతో రైతుల్లో నెలకొన్న బెంగ



వంగ పంట సాగు చేసిన చేనులో రైతు షఫివుల్లా



గిట్టుబాటు ధర లేక వంకాయలను పారేసిన దృశ్యం

చిన్నమండెం : రైతులు సాగు చేసిన వంగ పంటతో రైతుల్లో బెంగ నెలకొంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వండాడి గ్రామం తూర్పుపల్లెకు చెందిన షఫీవుల్లా ఐదు ఎకరాలలో రూ.5 లక్షలు పెట్టుబడితో వంగ పంట సాగు చేశారు. అయితే కూలీ ఖర్చులకు కూడా డబ్బులు రాలేదని రైతు వాపోయాడు. ఉజాలా రకానికి చెందిన వంగ పంటను ఐదు ఎకరాలలో సాగు చేశారు. వంగకు చెన్నై మార్కెట్ కేంద్రంగా మంచి డిమాండ్ ఉండే ఈ పంటను సాగు చేసినా పెట్టిన పెట్టుబడులు సైతం రాకపోగా రైతు దిగులుపెట్టుకున్నాడు. అసలే అప్పులు చేసి సాగు చేసిన పంటతో పెట్టుబడులు రాకపోగా కూలీలకు డబ్బులు పెట్టే స్తోమత లేకుండా తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక పంటను చేనుల్లోనే పారేస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి.

వంగ పంటతో నిండా మునిగా

నాకు ఉన్న 5 ఎకరాలలో పొలంలో వంగ పంటను సాగు చేశా. రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేశాను. తీరా పంటకు చేతికొచ్చే సమయంలో గిట్టుబాట ధర లేక కూలీలకు డబ్బులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వంగను సాగు చేసి నిండా మునిగాను.

- షఫీవుల్లా, రైతు, చిన్నమండెం మండలం

రాయచోటిలో 77.38 శాతం పోలింగ్

- ఓటు వేసేందుకు ఆసక్తి చూపిన మహిళలు
- నియోజకవర్గంలో 2,55,168 ఓట్లకుగాను 1,97,463 ఓట్లు నమోదు

రాయచోటి : సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలో 77.38 శాతం పోలింగ్ నమోదైంది.

సోమవారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ముగిసింది. నియోజకవర్గంలోని చాలా పోలింగ్ కేంద్రాలలో సాయంత్రం 6 గంటలకు కూడా ఓటర్లు క్యూ లైన్లలో ఉండటంతో వారి ఓట్లు పూర్తయ్యేటప్పటికీ రాత్రి 9 గంటలు పైబడింది. దీంతో పూర్తిస్థాయి పోలింగ్ శాతాన్ని అధికారులు సోమవారం అర్ధరాత్రి వరకు నివేదిక రూపంలో అందించలేకపోయారు. మంగళవారం ఉదయం సమగ్రంగా నివేదికలను తయారు చేసి ఎన్నికల అధికారికి అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 292 పోలింగ్ కేంద్రాలలో 2,55,168 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 126090 మంది ఉండగా 96426 మంది, మహిళలు 129051 మందికి గాను 101031 మంది, ఇతరులు 27 మందికిగాను 6 మంది వంతున ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో రాయచోటి నియోజకవర్గం 77.38 శాతంగా పోలింగ్ నమోదైంది.

మహిళలదే పైచేయి..

రాయచోటిలో పురుషుల సంఖ్య కంటే మహిళా ఓటర్ల సంఖ్య 3 వేలకుపైగా ఉన్నాయి. పోలింగ్ రోజు కూడా మహిళా ఓటర్లు ఓటు వేయడానికి పురుషులకంటే అధికంగా పోలింగ్ కేంద్రానికి చేరుకొని తమ ఓటును వేశారు. అభ్యర్థుల గెలుపులో మహిళా ఓటర్లు కీలకపాత్రను పోషించనున్నారు.

కైఫియత్తులే ఇంటిపేరుగా 'కట్టా'

నేడు విద్వాన్ కట్టా నరసింహులు వర్ధంతి



కట్టా నరసింహులు (ఫైల్)

కడప కల్చరల్ : కైఫీయత్తుల పరిష్కర్తగా విద్వాన్ కట్టా నరసింహులు ఖ్యాతిగడించారు. నిజానికి ఆయన సాహితీవేత్తగా కంటే 'కై ఫియత్తుల కట్టా'గానే తెలుగు వారికి సుపరిచితులు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఆయన గురించి..

- ఒంటిమిట్ట సమీపంలోని కొత్తపల్లికు చెందిన కట్టా నరసింహులు తెలుగు పండితుడిగా సేవలందించారు. కొన్ని అవధానాలు చేశారు. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రితో పరిచయం కట్టా పదవీ విరమణ తర్వాత ఆయనను సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి చేర్చింది. భాష, పరిశోధనలపై కట్టాకుగల ఆసక్తిని గమనించిన డాక్టర్ జానమద్ది బ్రౌన్ గ్రంథాలయ తాళపత్ర గ్రంథాల విభాగాన్ని పటిష్ఠం చేసే బాధ్యతను, ఆ తర్వాత మెకంజీ రాసిన కడప కైఫియత్తుల పరిష్కార బాధ్యతను అప్పగించారు. 8 సంపుటాలు 3000 పైచిలుకు పేజీలతో వాటిని పరిష్కరించి వాటి సారాంశాన్ని అందుబాటులోకి తెచ్చారు కట్టా. ఎనిమిదేళ్లపాటు జిల్లా చరిత్రలో మరుగున పడిన పలు చారిత్రిక అంశాలను వెలికితీసిన ఆయన కడప కైఫియత్తుల ఆధారంగా జిల్లా చారిత్రక అంశాలతో 'కై ఫియత్ కథలు' పేరిట పుస్తకం వెలువరించారు.
- భక్తకన్నప్ప జన్మస్థలి రాజంపేటలోని ఊటుకూరు గ్రామమేనని వెలుగులోకి తెచ్చారు. రాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల లాగానే మట్లి రాజుల వద్ద కూడా అష్టదిగ్గజ కవులుండేవారని తన పరిశోధనల్లో వెలికితెచ్చారు.
- రాష్ట్ర విభజన నేపథ్యంలో ఒంటిమిట్ట ఆలయ చరిత్రకు సంబంధించిన శాసనాలు, ఇతర అంశాలను వెల్లడించి ఆ ఆలయానికి ప్రభుత్వ లాంఛనాలు లభించడంలో కృషి చేశారు. ఈ కృషి ఆయనకు తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలోని పోతన భాగవతం ప్రాజెక్టులో సేవలందించే అవకాశాన్ని కల్పించింది. అక్కడ పనిచేస్తూనే ఆయన 2021 మే 15న కన్నుమూశారు.

కనీస వసతులు కానరావేలా?



పుల్లంపేట రైల్వే స్టేషన్

పుల్లంపేట : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో కరోనాకు ముందు అన్ని రైళ్లు ఆగేవి. ప్రస్తుతం అర్కోణం, ఇంటర్‌సిటీ ప్యాసెంజర్ రైళ్లు మాత్రమే రైల్వేస్టేషన్‌లో ఆగతుండటంతో ప్రయాణీకులు ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం రాజంపేటకు వెళ్లాల్సి వస్తోంది. రైల్వే అధికారులు తాగునీటి వసతి కల్పించకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి పుల్లంపేట రైల్వేస్టేషన్‌లో తాగునీటి వసతిని కల్పించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న తాగునీటి కుళాయిలు

ఈదురుగాలులతో కూడిన వర్షం



పెద్దమండ్యం : ఈదురుగాలులతో నేలకూలిన విద్యుత్ స్తంభం



పెద్దతిప్పసముద్రం : బి.కొత్తకోట మెయిన్ రోడ్డులో కూలిన చెట్టు

పెద్దమండ్యం : మండలంలో సోమవారం రాత్రి ఈదురుగాలలతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులు, పెద్దెత్తున ఉరుములు, మెరుపులు రావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెలిగల్లు, వడ్డిపల్లె, సీ గొల్లపల్లె, పెద్దమండ్యం, ముసలికుంట, బండ్రేవు గ్రామాలలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రైతుల పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు నేల కూలడంతో అధికారులకు రైతులు సమాచారం అందించారు. విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా లేకుండా పోయింది. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా కోసం యుద్ధప్రాతిపదికన పనులు చేశారు. ఓ మోస్తరు వర్షం కురవడంతో అక్కడక్కడ చిన్న కుంటల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది. ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి వర్షం ఉపశమనం కలిగించింది.

అకాల వర్షంతో నష్టం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పలు రైతులు సాగు చేసిన పంట పొలాలు దెబ్బ తిన్నాయి. పలు చోట్ల విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. భారీ వృక్షాలు సైతం కూకటి వేళ్ళతో నేలకొరిగాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

తిరుపతిలో జాతర డప్పు దరువు

తిరుపతి కల్చరల్: 'ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా.. చాటింపుతో నేటి నుంచి తిరుపతి గంగజాతర ప్రారంభమైంది. వారం రోజుల పాటు తిరుపతిలో గంగజాతర కొనసాగుతుంది. కనుక నగరవాసులెవ్వరూ ఊరు వదలి వెళ్లరాదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు రాత్రి పూట ఇక్కడ బస చేయకుండా తిరిగి వెళ్లిపోవాలి. జాతర ప్రారంభమైనందున అమ్మవారి అనుగ్రహం పొందేందుకు పూజలు నిర్వహించుకోవాలహో'.... అంటూ మంగళవారం కైకాల వంశస్థులు తిరుపతి గంగజాతర చాటింపు వేశారు. భేరివీధిలో తొలి చాటింపు పూజ నిర్వహించారు. అనంతరం నాటి నగర శివారు ప్రాంతాల్లో చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు.

గంగమ్మకు వేడుకగా పుట్టింటి సారె

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి అవిలాల నుంచి మంగళవారం రాత్రి సాంప్రదాయ పుట్టింటి సారె వేడుకగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రీతాతయ్యగుంట గంగమ్మకు తొమ్మది రోజుల పాటు అత్యంత వైభవంగా జాతర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. తిరుపతి గంగజాతర ముందు వారం అమ్మవారి పుట్టినిల్లు అయిన అవిలాలలో జాతర చాటింపు చేసి గ్రామస్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో జాతర వేడుకలను జరుపుకుంటారు. చివరి రోజు అవిలాలలోని అమ్మవారి పుట్టింటి సారె నడిపే పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి ఇంటి నుంచి ఆడపడుచుకు సాంప్రదాయ బద్ధంగా అందించే పుట్టింటి సారెను అవిలాల పొలిమేరలో వెలసిన గంగమ్మ గుడి వద్దకు మేళతాళాల మధ్య కోలాహలంగా తీసుకొచ్చారు. అమ్మవారి సారెను అందుకునేందుకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈఓ కె.మమత, సిబ్బంది, జాతరలో వంశపారంపర్యంగా కీలక పాత్ర పోషిస్తున్న కైకాల వంశీయులు అవిలాల పొలిమేరలోని గంగమ్మ గుడికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టింటి వారి నుంచి అమ్మవారికి సారెను అందుకొని ఊరేగింపుగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. సారెను గంగమ్మ గుడి అధికారులు, కైకాల వంశస్తులు స్వీకరించి ఊరేగింపుగా తిరుపతి తాతయ్యగుంట ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి సారెతో అలంకరించి పూజలు నిర్వహించారు. తర్వాత సాంప్రదాయ బద్ధంగా కై కాల కులస్తులు బేరివీధికి చేరుకుని చాటింపు పూజ చేపట్టారు. అనంతరం నాటి నగర సరిహద్దులలో అష్ట బంధనం చేసి జాతర మొదలయ్యేందహో అంటూ చాటింపు వేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మురళీస్వామి, కైకాల కులస్తులు, అవిలాల గ్రామపెద్దలు పెద్దిరెడ్డి, సురేష్, లోకేష్, చెంగల్రాయులు, వెంకటేష్ పిళ్లై, తనూజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత యూనివర్సిటీలో 2024-25 విద్యాసంవత్సరానికి పీజీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ రమాశ్రీ తెలిపారు. ప్రధానంగా ఆచార్య, ఎంఏ శబ్ద బోధ, ఎంఏ హిందీ, ఎమ్మెస్సీ యోగా థెరఫీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులలో అడ్మిషన్లు పొందేందుకు ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) ప్రవేశపరీక్ష పాసైన అభ్యర్థులు మాత్రమే పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా రెగ్యులర్ పద్ధతిలో ప్రాక్‌శాస్త్రి కోర్సులో ప్రవేశానికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చిన్నారికి రక్తదానం

పెద్దతిప్పసముద్రం : బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ చిన్నారి పాపకు రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న మండలంలోని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యుడు అనిల్‌కుమార్ ఆసుపత్రికి వెళ్ళి రక్తదానం చేసినట్లు సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ మంగళవారం పేర్కొన్నారు.

కడప అసెంబ్లీ నియోజకవర్గంలో 144 సెక్షన్

- జూన్ 6 వరకు అమలు
- కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్




ఎం.డి షరీఫ్, కడప డీఎస్పీ

కడప అర్బన్ : కడప అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ఈనెల 14 వ తేదీ ఉదయం నుంచి జూన్ 6వ తేదీ వరకు జిల్లా ఎన్నికల అధికారి (జిల్లా కలెక్టర్) జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సెక్షన్ 144 అమలులో వుంటుందని కడప డీఎస్పీ ఎండి. షరీఫ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి, ఎన్నికల నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలను నివారించడం కోసం కడప నియోజక వర్గ పరిధిలోని కౌంటింగ్ సెంటర్‌గా గుర్తించిన మౌలానా అబ్దుల్ కలాం నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ (ఎంఎన్‌యుయు) పరిసర ప్రాంతంలో సెక్షన్ 144 అమలులో వుంటుందని తెలిపారు. ఈ నెల 31 వరకు కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో వుందని గుర్తు చేశారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటే 24 గంటల ముందు లిఖితపూర్వకంగా పోలీసు వారికి అర్జీ ఇచ్చి వారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అలా కాని పక్షంలో చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని ఆయన హెచ్చరించారు.

ట్యాప్ తిప్పరో.. దాహం తీర్చరో!



మండల పరిధి మోట్నూతల పల్లెలోని పాఠశాలలో ఉన్న కుళాయికి చుక్కచుక్క నీరు వస్తుండటంతో వాటితో వానరం తన దాహం తీర్చుకుంటున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

పులివెందుల రూరల్

ప్రజా ఆశీర్వాదంతో విజయం తథ్యం

వాల్మీకిపురం : ప్రజల ఆశీర్వాదంతో 2024లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగరవేయడం తథ్యమని వైఎస్సార్‌సీపీ పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పీలేరు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ సంక్షేమ పథకాలే పార్టీని విజయపథంలో నడిపిస్తాయన్నారు. జూన్ 4న మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.